క్లుప్తంగా

మోడల్‌స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గరిడేపల్లి : మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్‌లో 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ ఐతరాజు సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అడ్మిషన్ల కోసం ఒక సెట్ ఒరిజనల్ సర్టిఫికెట్లు, ఒక సెట్ జీరాక్స్‌లతో వచ్చి కళాశాలలో అందజేయాలన్నారు. అదే విధంగా 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు గణితం బోధించేందుకు అర్హులైన అభ్యర్థులకు జూన్ 7, 8తేదీల్లో డెమో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎమ్మెస్సీ మ్యాథ్స్, బీఈడీ చేసిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 96180 66984, 96666 65733ను సంప్రదించాలన్నారు.

దరఖాస్తు గడువును పొడిగించాలి

కోదాడరూరల్ : మండల పరిధిలోని గుడిబండలో సర్వే నంబర్ 429లో గల ప్రభుత్వ భూమిలో అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు గడువు తేదీని పొడిగించాలని పీఏసీఎస్ డైరెక్టర్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారు ఈనెల 1నుంచి 3వతేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని గ్రామపంచాయతీ కార్యాలయంతో రెవెన్యూ అధికారులు ప్రచురించారని, ఈ విషయం గ్రామంలో చాలా మందికి తెలియదని, దీంతో అనేక మంది అర్హులు దరఖాస్తు చేసుకోలేకపోయారని తెలిపారు. అధికారులు మరో రెండు రోజులు గడువు పెంచితే అర్హులైన పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.

రేషన్‌డీలర్ల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో పాల్గొన్న రేషన్‌డీలర్లు

నేరేడుచర్ల : రేషన్‌డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు పాండయ్య డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన రేషన్‌డీలర్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. డీలర్ల హక్కుల సాధనకై డీలర్లు రేషన్ దుకాణాలను స్వచ్ఛందంగా బంద్ చేసి సమ్మెలో పాల్గొనాలని అన్నారు. డీలర్ల సమ్మెలో కార్యచరణను రూపొందించడం జరుగుతుందన్నారు. ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు అబ్బాస్, డీలర్లు చింతమళ్ల సైదులు, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, ఎల్లయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాంకుమార్, శ్రీకాంత్, నరేష్, జానీ, గణేష్, కృష్ణయ్య తదితరులున్నారు.

నేడు విద్యుత్ విజయోత్సవం

హుజూర్‌నగర్ : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గ స్థాయిలో విద్యుత్ విజయోత్సవ వేడుకలను పట్టణంలో సోమవారం నిర్వహించనున్నట్లు విద్యుత్ డీఈ వెంకటకిష్టయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు, ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రమాదకరంగా గుంత



చిలుకూరు అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద ప్రమాదకరంగా ఉన్న గుంత

చిలుకూరు : మండల కేంద్రం శివారులోని కాలువ ఒడ్డున గల శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం వద్ద ఉన్న గుంత ప్రమాదకరంగా ఉంది. కోదాడ– జడ్చర్ల నేషనల్ హైవే రోడ్డు పనులు చేసే క్రమంలో ఆ కాలువ వద్ద పనులు పూర్తి చేయకుండా వదిలేశారు. దేవాలయం పక్కన రోడ్డుకు మాత్రం రైలింగ్ ఏర్పాటు చేసి రైలింగ్ లోపల గుడి పక్కన గుంతను మరిచారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు గుడి చుట్టూ ప్రదక్షణలు చేసే క్రమంలో అందులో పడిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే గుంతను పూడ్చివేయాలని గ్రామస్తులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

వెంకటేశ్వర శర్మ మృతికి సంతాపం



వెంకటేశ్వరశర్మ (ఫైల్)

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని శ్రీ ఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభూ శంభులింగేశ్వరస్వామి దేవాలయం మాజీ ప్రధానార్చకుడు, అర్చక సంఘం వ్యవస్థాపక జిల్లా అధ్యక్షుడు కొంకపాక వెంకటేశ్వరశర్మ (78) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. దీంతో ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేసి నివాళులర్పించారు.

అక్రమంగా మట్టి తవ్వకాలు..!

- రాత్రి సమయాల్లో గుట్టుచప్పుడు కాకుండా మట్టి తరలింపు
- చెరువులు, గుట్టలను సైతం వదలని అక్రమార్కులు
- చోద్యం చూస్తున్న అధికారులు



శిలువగుట్టలోని మట్టిని తవ్వి తరలిస్తున్న అక్రమార్కులు

హుజూర్‌నగర్ రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లోని గుట్టలు, ఏనేలను అక్రమార్కులకు వరంగా మారుతున్నాయి. ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా ఏనేగుట్టలలోని మట్టిని అక్రమంగా తరలిస్తూ అక్రమార్కులు సొమ్ముచేసుకుంటున్నారు. మట్టికి బాగా డిమాండ్ పెరగడంతో కొందరు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారు. హుజూర్‌నగర్ మండలంతో పాటు ఇతర ప్రాంతాల్లో మట్టికి డిమాండ్ ఉండడంతో లింగగిరి, శ్రీనివాసపురం గ్రామాల శివారులో ఉన్న గుట్టలను అడ్డాగా చేసుకుని రాత్రికి రాత్రే మట్టిని అక్రమంగా తవ్వకాలు చేస్తున్నారు. కొన్ని రోజులుగా ఇంత జరుగుతున్నా అడ్డుకోవాల్సిన రెవెన్యూ, మైనింగ్, పోలీస్ అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రైవేట్, ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు..

మండలంలో లింగగిరి, శ్రీనివాసపురం తదితర గ్రామాల్లో నిత్యం పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టి తోలకాలను చేపడుతున్నారు. ప్రైవేట్ భూముల్లోనే కాకుండా ప్రభుత్వ భూములు, గుట్టలను సైతం అక్రమార్కులు వదలడం లేదు. ఈ విషయంపై ఆయా గ్రామాల ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గత నెల7వ తేదీ రాత్రి లింగగిరి, శ్రీనివాసపురం గ్రామాల శివారులోని రహదారి పక్కన ఉన్న సర్వే నంబర్ 317లోని సిలువ గుట్ట ఏనేకర్రను ప్రొక్లెన్లతో మట్టి తవ్వకాలు జరుపుతూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారనే సమాచారం ఇవ్వగా స్థానిక తహసీల్దార్ వీఆర్ఏను పంపించి పనులను నిలిపి వేయించారే తప్ప వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేదనే విమర్శలు వస్తున్నాయి. కాగా ఆదివారం ఉదయం నుంచి మళ్లీ యథేచ్ఛగా అదే శిలువ గుట్టను తవ్వుతున్నారని గ్రామస్తులు సమాచారం అందించినా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకుండా చోద్యం చూస్తున్నారని గ్రామస్తులు వాపోయారు. కాగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు వారికి అండగా నిలుస్తున్నారే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. మట్టి రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిఘాపెట్టి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

చట్టపరమైన చర్యలు చేపడతాం



మండలంలోని లింగగిరి, శ్రీనివాసపురం గ్రామాల శివారులోని రహదారి పక్కన గల శిలువ గుట్ట (ఏనేకర్ర)ను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. వెంటనే ఆర్ఐ, వీఆర్ఏలను పంపించి పనులు నిలిపివేయించాం. అనుమతులు లేకుండా గుట్టను తవ్వి మట్టిని అక్రమంగా తరలించిన వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు చేపడతాం.

– వజ్రాల జయశ్రీ, తహసీల్దార్, హుజూర్‌నగర్

అలరించిన వీరబ్రహ్మేంద్రస్వామి నాటక ప్రదర్శన



నాటకాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు

గరిడేపల్లి : మండలంలోని గానుగుబండ గ్రామంలో శ్రీ శ్రీనివాస నాట్య కళామండలి వారు శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి నాటకాన్ని సినీ సెట్టింగ్‌లతో ప్రదర్శించారు. బ్రహ్మంగారిగా, సిద్దయ్యగా నంది అవార్డు గ్రహీతలు గోధుమల మల్లయ్యచారి, గోధుమల ఈశ్వరాచారి నటించి ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నారు. వారిద్దరూ తండ్రీ, కొడుకులు కావడం విశేషం. నాటకాన్ని వీక్షించేందుకు మండలంతో పాటు హుజూర్‌నగర్, మఠంపల్లి మండలాల నుంచి ఆయా గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. ఈ నాటకానికి వ్యాఖ్యాతగా జిల్లా రంగస్థల కళాకారులు కంబాల శ్రీనివాస్, దర్శకత్వం గోధుమల మల్లయ్యాచారి, సంగీతం బొడ్డుపల్లి రంగారావు, నారదుడిగా ఎస్‌కె నబిసాహెబ్, భూదేవిగా గుర్రం జయమ్మ, కక్కడుగా జానపాటి సైదులు, పటేల్‌గా పాకల ఆంజనేయులు, ఈశ్వరమ్మ పాత్రలో గోధుమల ఈశ్వరమ్మ తదితరులు నటించారు.

ముత్యాలు మృతికి సంతాపం

చిలుకూరు : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎన్ఎంఆర్ వాటర్ పంపు ఆపరేటర్‌గా పనిచేస్తున్న పంచాయతీ సిబ్బంది మాదాసు పెద్దముత్యాలు (46) ఆదివారం విధులు నిర్వహిస్తుండగా అనారోగ్య సమస్యతో కుప్పకూలిపోయాడు. అతడి గమనించిన స్థానికులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు మృతుడి బంధువులు తెలిపారు. ముత్యాలు మృతి పట్ల ఎంపీడీఓ ఈదయ్య, సర్పంచ్ కొడారు బాబు, ఎంపీటీసీలు బెల్లంకొండ రమణ నాగయ్య, వడ్డేపల్లి కళ్యాణ కోటేష్, గ్రామ కార్యదర్శి శోభన్‌బాబు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు దొడ్డా సురేష్‌బాబు, పాసైటీ ఛైర్మన్ అలసకాని జనార్దన్, డీఎల్‌డీఏ డైరెక్టర్ కస్తూరి నర్సయ్య, వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

గరిడేపల్లి : మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నేటి నుంచి రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచనున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డు తీసుకొని వచ్చి జీలుగ విత్తనాలను తీసుకోవాలన్నారు. 30 కేజీల బ్యాగుకు సబ్సిడీపోను రూ.843 చెల్లించి తీసుకెళ్లాలని కోరారు.

సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం



సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెంలో సోనియాగాంధీ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కె చాంద్‌పాషా మాట్లాడుతూ.. తెలంగాణ మలిదశ ఉద్యమంలో 12మంది యువకుల ఆత్మబలిదానంతో కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చలించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సహకరించారని అన్నారు. రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీని నేడు కేసీఆర్ పూర్తిగా మరిచిపోయారని అన్నారు. బంగారు తెలంగాణ పేరుతో కేసీఆర్ అప్పుల తెలంగాణగా మార్చారని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోమయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, మట్టయ్య, లక్ష్మీనారాయణ, సైదులు, రాంమ్మూర్తి, నాగులుమీరా, బాదే నర్సయ్య, రాములు, మస్తాన్, కోటయ్య, రాంబాబు, అజీత్‌మియా, విజయ్, వెంకటనర్సు, నవీన్, శ్రీను, నాగయ్య, వెంకటేశ్వర్లు, మధర్, బక్కయ్య, నాగమ్మ తదితరులున్నారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గరిడేపల్లి : మండలంలోని కాలువపల్లి గ్రామంలో గల శ్రీశీతల పరమేశ్వరీ(బొడ్రాయి), శ్రీసీతారామ చంద్రలక్ష్మణ, ఆంజనేయస్వామి, శిఖరకీర్తి ధ్వజ గణపతి, షిరిడీసాయినాథ, దత్తాత్రేయ, శ్రీరాధాకృష్ణ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు రెండో రోజు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా సుప్రభాతసేవ, మామిడి తోరణాలు, గణపతి పూజ, పుణ్యావాచనం, నవ కలశస్థాపన, జలాదివాసం గ్రామంలో బలిహారణ, సర్వతో భద్ర మంటప ఆరాధనతో పాటు హోమాలు తదితర కార్యక్రమాలను పూజారులు వేదమంత్రాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో పూజారులు రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, రాజశేఖరశర్మ, పవన్‌కుమార్‌శర్మ, ఉపేందర్‌శర్మ, భక్తులు, యువకులు పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్ శకటానికి తృతీయ స్థానం



మునగాల : మంత్రి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న సీఐ వీరరాఘవులు



హుజూర్‌నగర్ : సీఐ రామలింగారెడ్డికి ప్రశంస పత్రం అందజేస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి

మునగాల : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సురక్ష దినోత్సవం కార్యక్రమంలో మునగాల సర్కిల్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శకటాలలో మునగాల సర్కిల్ ఆధ్వర్యంలో సైబర్ క్రైమ్‌కు సంబంధించిన ఏర్పాటు చేసిన శకటానికి జిల్లా స్థాయిలో తృతీయస్థానం సాధించినట్లు మునగాల సర్కిల్ సీఐ పి.వీ రాఘవులు తెలిపారు. సైబర్‌క్రైమ్‌కు సంబంధించి ఎస్పీ రాజేంద్రప్రసాద్, మంత్రి జగదీష్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మునగాల సర్కిల్ పరిధిలోని మునగాల, నడిగూడెం, మోతె పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు పి.లోకేష్, ఏడుకొండలు, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశంస పత్రాలు అందుకున్న సీఐ, ఎస్ఐ

హుజూర్‌నగర్ : తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సూర్యాపేటలో జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన పోలీస్ సురక్ష దినోత్సవంలో హుజూర్‌గర్ సీఐ రామలింగారెడ్డి, ఎస్ఐ వెంకటరెడ్డిలు ప్రశంస పత్రాలు అందుకున్నారు. దొంగతనం కేసులను త్వరగా ఛేదించినందుకు గాను వారికి విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి ప్రశంస పత్రాలు అందజేసినట్లు తెలిపారు. దీంతో వారికి పలువురు అభినందనలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సంఘం నూతన కమిటీ సభ్యులు

పాలకవీడు : మండల కేంద్రంలో విశ్వబ్రాహ్మణ సంఘం సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా దేవులపల్లి నర్సింహాచారి, ఉపాధ్యక్షులుగా సూరోజు రవీంద్రాచారి, సైదాచారి, ప్రధాన కార్యదర్శిగా ఉపేంద్రచారి, కార్యదర్శిగా పాండయ్యాచారి, కోశాధికారిగా భార్గవచారి, కార్యవర్గ సభ్యులుగా సతీష్‌చారి, వెంకటాచారి, సైదాచారి, బ్రహ్మచారి, సూరోజు బ్రహ్మచారిని ఎన్నుకున్నారు. అనంతరం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు నర్సింహాచారి మాట్లాడుతూ.. సంఘం సమస్యలపై నిరంతరం తనవంతు కృషి చేస్తానని అన్నారు.

అమరవీరుల ఆశయ సాధనకు కృషిచేయాలి

నడిగూడెం : అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు సీపీఎం సీనియర్ నాయకులు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని రామాపురంలో నిర్వహించిన దివంగత సీపీఎం నాయకుడు కృష్ణసాగరపు రామారావు వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కృష్ణసాగరపు వీరబాబు, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మునగ గోవిందు, వాసు, సురేష్, వెంకటేష్, కుటుంబసభ్యులు రంగమ్మ, సౌభాగ్యం, రామానుజమ్మ, పద్మ, విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గరిడేపల్లి : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



కోదాడరూరల్ : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కోదాడరూరల్ : మండల పరిధిలోని గణపవరం ఉన్నత పాఠశాలలో 1996–97 విద్యా సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 26సంవత్సరాల తర్వాత కలుసుకున్న చిన్ననాటి స్నేహితులు ఒకరినిఒకరు ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. చిన్ననాటి రోజులకు గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రసాదరావు, లక్ష్మీనర్సింహారావు, రుక్మారావు, విద్యార్థులు చిలుకూరు ఎంపీపీ బండ్ల ప్రశాంతి, భూపతిరెడ్డి, కొప్పుల సాగర్‌రెడ్డి, మౌలానా, నాగిరెడ్డి, అంజమ్మ, గీత, రాధిక, భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మునగాల : మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాలలో 1988–91లో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనాడు విద్యాబోధన చేసిన పలువురు విశ్రాంత ఉపాధ్యాయులను వారు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఆనాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ఆనాటి పూర్వ విద్యార్థుల్లో మృతి చెందిన మండల కేంద్రానికి చెందిన రచ్చా వెంకటేశ్వర్లు కుటుంబానికి ఆర్థికసాయంతో పాటు అనారోగ్యానికి గురైన కలకోవ గ్రామానికి చెందిన మండవ లింగయ్య, వెంకట్రాంపురం గ్రామానికి చెందిన దొంగరి సత్యనారాయణలకు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆనాటి ఉపాధ్యాయులు జెట్టి రామిరెడ్డి, మోహన్‌రెడ్డి, రత్నాచారి, కొర్రా తులిశమ్మ, సునందాదేవి, రంగారావు, దయానంద్, కృష్ణమూర్తి, శంకరయ్య, పూర్వవిద్యార్థులు ఎల్.నాగబాబు, జెట్టి సునీత, ప్రసాద్, లోకేష్, శ్రీనివాసరావు, వెంకటరత్నం, లింగయ్య, సైదాబీ, మాధవి, విజయలక్ష్మి, శ్రీను, రామమూర్తి పాల్గొన్నారు.

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్న జెడ్పీ పాఠశాలలో 1994–95సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించారు. అనంతరం పాఠశాలకు రూ.10వేల విలువగల ఫర్నీచర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఆనా టి ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, వెంకటయ్య, భిక్షం, గురువులు, పూర్వ విద్యార్థులు సతీష్, కోటేశ్వర్‌రావు, జానయ్య, శ్రీకాంత్, సైదులు, శంకర్, శ్రీను, నాగలక్ష్మి, మమత, అనిత, కృష్ణవేణి ఉన్నారు.

పొనుగోడులో..

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు జెడ్పీ పాఠశాలలో 2001–2002 సంవత్సరంలో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికోకరు ఆప్యాయంగా పలకరించుకొని ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం గురువులు శ్రీనివాస్ రెడ్డి, వెంకయ్య, వెంకటేశ్వర్లు, మల్లయ్య, సత్యం, పద్మావతిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు పిచ్చయ్య, సలీం, వీరశేఖర్, బొడ్డుపల్లి సుమలత సైదులు, చైతన్య, నరేష్, జానకిరాములు, తదితరులు పాల్గొన్నారు.



మునగాల : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు



నేరేడుచర్ల : పెంచికల్‌దిన్నలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఘనంగా ఏరువాక పౌర్ణమి



మేళ్లచెరువు : ఏరువాక నిర్వహిస్తున్న రైతులు

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని రైతులు ఏరువాక పౌర్ణమి వేడుకను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ ఎడ్లను, ఆవులను ట్రాక్టర్లను ప్రత్యేకంగా అలంకరించి నాగళ్లను పూజించి కొటేరు వేసి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా తమ అరకలను ఊరేగింపు నిర్వహించి అనంతరం విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, అధిక సంఖ్యలో రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలువురు రైతులకు సన్మానం



మునగాల : రైతులను సన్మానిస్తున్న సత్యనారాయణ

మునగాల : మండలంలోని నర్సింహాపురంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఆదివారం పలువురు రైతులను గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ.. భూమి, పంట, పశువులను మొక్కడం భారతీయ సంస్కృతి సంప్రదాయమని, భూమి తనలోని సారాన్ని ధాన్యంగా మార్చి భూమాత మనకు అందిస్తుందని, ఆ సారాన్ని ఆహారంగా మార్చేందుకు మనిషి చేసే పవిత్ర యజ్ఞమే వ్యవసాయమన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతులను ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. రైతులకు బ్యాంకుల ద్వారా రుణసాయం, నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు సబ్సిడీపై అందజేయాలని సూచించారు. అదే విధంగా 55సంవత్సరాలు దాటిన ప్రతి రైతుకు నెలకు రూ.5వేల పింఛన్ అందించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బొమ్మ చినవెంకన్న, వేల్పుగొండ నాగయ్య, వీరబోయిన అక్కులు, మీసాల కోటయ్య, శ్రీను , సన్మానం పొందిన రైతులు మంద వెంకటేశ్వర్లు, బొమ్మ శ్రీనివాస్, వీరబోయిన వెంకన్న, మీసాల మైసయ్య, మహిళా రైతు గడ్డం గోవిందమ్మ తదితరులు ఉన్నారు.

రావి నారాయణ రెడ్డికి ఘన నివాళి

దురాజ్‌పల్లి (సూర్యాపేట) : తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, ప్రజల మనిషి రావి నారాయణరెడ్డి ఆశయ సాధన కోసం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రావి నారాయణరెడ్డి 115 వ జయంతి సందర్భంగా ఆ పార్టీ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రావి నారాయణరెడ్డి జీవితం త్యాగాలమయం అని, భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ ఆనాటి రాజరిక వ్యవస్థ నిర్బంధాలకు వ్యతిరేకంగా పేదల పక్షాన నిలబడి, పోరాడి జైలు జీవితం గడిచి తెలంగాణకే వేగుచుక్కలాగా నిలిచిన వ్యక్తి అని అన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలి

హుజూర్‌నగర్ : పర్యావరణ పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించాలని సామాజిక, ఆర్టీఐ కార్యకర్త మన్సూర్‌అలీ అన్నారు. ఆదివారం పట్టణంలోని మగ్దూం నగర్‌లో వరిపొలాల్లో కొయ్యలకు నిప్పపెట్టడంతో రోడ్డు వెంట కాలిన మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు వరికొయ్యలకు నిప్పుపెట్టడంతో పర్యావరణానికి హాని జరుగుతుందని, పర్యావరణ పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని అన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని పర్యావరణ పరిరక్షణపై రైతులకు, కౌలు రైతులకు అవగాహన కల్పించాలని ఆయన కోరారు.